www.nagaranijam.com PRGI/RNI NO: APTEL/2013/54450

# నగరనిజం


www.nagaranijam.com అక్షరనిజం నగరనిజం తెలుగు దిన పత్రిక

| సంపుటి : 13 | సంచిక : 297 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 15 గురువారం, జనవరి 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 13 | Issue : 297 | Rangareddy | Editor : Yela.Purushotham | 15 Thursday, January 2026 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు : ☎8247467562
Email Id : nagaranijam@gmail.com
Website : www.nagaranijam.com

NNTV TELANGANA నగర నిజం



పాఠకులకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు. సంక్రాంతి పండుగ సందర్భంగా పత్రిక కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం పత్రిక వెలువడదు. తిరిగి మరుసటి సంచిక శనివారం వెలువడుతుంది. ఈ విషయాన్ని పాఠకులు గమనించగలరు.

ఇట్లు
నగరనిజం ఎడిటర్.

# భూసేకరణ వేగంగా పూర్తి చేయండి

● ఇంజినీర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్, నగరనిజం:**ప్రాజెక్టుల కింద బ్రాంచి, పిల్లకాలువల వ్యవస్థను పూర్తి చేసేందుకు అవసరమైన భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇంజినీర్లకు సూచించారు. సీఎం మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో.. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితోపాటు పలువురు అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 16న ప్రారంభోత్సవం చేయనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చనాఖా-కోర్ట ఎత్తిపోతల పంపులు, సదర్మాట్ బ్యారేజీ వివరాలపై ఆరా తీసినట్టు సమాచారం. వీటితోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలోని చిన్నకాళేశ్వరం ఎత్తిపోతలపైనా సమీక్షించారు. మేడిగడ్డ,



అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరావాస డిజైన్లను త్వరగా పూర్తిచేసి, వాటిని కేంద్ర జల సంఘానికి పంపించి ఆమోదం తీసుకోవాలని సీఎం సూచించారు.



## శబరిమలలో మకరజ్యోతి దర్శనం..

**శబరిమల,హైదరాబాద్, నగరనిజం::** హరిహరక్షేత్రం శబరిమల 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మకర సంక్రాంతి సందర్భంగా జ్యోతి దర్శనం కోసం భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయానికి ఈశాన్య దిశలో పర్వతశ్రేణుల నుంచి వెలుగులీనుతున్న జ్యోతి దర్శనమిచ్చింది. జ్యోతి దర్శనంతో వేలాది మంది భక్తులు పులకించిపోయారు. హరిహర సుతుడైన స్వామి అయ్యప్పను స్మరిస్తూ స్వామియే శరణం అయ్యప్ప అన్న శరణుఘోషలతో శబరిగిరులు ప్రతిధ్వనించాయి. కాంతమాల కొండలపై దేవతలు, రుషులు కలిసి భగవంతునికి హారతి ఇస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతకుముందు పందాళం నుంచి తీసుకువచ్చిన తిరువాభరణాలను ప్రధాన అర్చకులు స్వామివారికి అలంకరించారు. అనంతరం మూలమూర్తికి హారతి నిచ్చారు. ఆ వెంటనే క్షణాల్లో చీకట్లను తొలగిస్తూ పొన్నాంబలంమేడు పర్వత శిఖరాల్లో జ్యోతి దర్శనమైంది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు శబరిమలకు భారీగా తరలివచ్చారు.

# రైలుపై జారిపడిన క్రేన్..

● 29 మంది మృతి

**బ్యాంకాక్,హైదరాబాద్, నగరనిజం::** థయ్‌లాండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కదులుతున్న రైలుపై ఓ క్రేన్ జారిపడటంతో బోగీలు పట్టాలు తప్పాయి. ఈ దుర్ఘటనలో 29 మంది మృతి చెందినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. బ్యాంకాక్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిఖియో జిల్లాలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్ కోసం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ నిర్మాణ పనుల్లో ఉన్న ఓ క్రేన్ అదుపుతప్పి ఒక్కసారిగా కింద పడింది. అదే సమయంలో కింద ఉన్న పట్టాలపై నుంచి ఓ



ప్రయాణికుల రైలు వెళ్తోంది.క్రేన్ పడటంతో ఆ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో మంటలు చెలరేగాయి. ఈ సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 29 మంది మృతిచెందగా.. మరో 60 మందికి పైగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బోగీల్లో చిక్కుకున్న వారిని వెలికితీస్తున్నట్లు తెలిపారు.రైలు బ్యాంకాక్ నుంచి ఉబోన్ రాచథని ప్రావిన్స్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రైలుకు మొత్తం 3 బోగీలు ఉండగా.. చివరి రెండు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో రైల్లో 195 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.


# సుక్మా జిల్లాలో 29 మంది మావోయిస్టులు లొంగుబాటు

**చర్ల:,హైదరాబాద్, నగరనిజం:** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట బుధవారం 29 మంది కీలక మావోయిస్టులు లొంగిపోయారు. గోగుండాలో ఎఫ్ఓబీ (ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్) ఏర్పాటు తర్వాత మావోయిస్టు కార్యకలాపాలు చాలా వరకు అదుపులోకి వచ్చాయని ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన వారంతా దర్భ, కేరళ పాల్ ఏరియా కమిటీలో చురుగ్గా వ్యవహరించిన వారేనన్నారు. తాజా పరిస్థితులు గమనించి మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి లొంగిపోతే మంచిదన్నారు.



## మాజీ మంత్రి తలసానిపై ఎస్ఆర్ నగర్ పీఎస్‌లో కేసు నమోదు

**హైదరాబాద్, నగరనిజం:**మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే, భారత రాష్ట్ర సమితి నేత తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి తలసాని చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రవికిరణ్ దేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఆర్ నగర్ పోలీసులు తెలిపారు.









# చెన్న కేశవపురం గ్రామ పెరిక సంఘం అధ్యక్షుడుగా మేకల గోవర్ధన్

- నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సముద్రాల రాంబాబు



**సూర్యాపేట, జనవరి,14(నగర నిజం) :** సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం నడిగూడెం మండలం చెన్న కేశవపురం గ్రామం పెరిక సంఘం నూతన కమిటీని బుధవారం గ్రామంలోని మేకల కృష్ణమూర్తి మామిడి తోటలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. గ్రామ పెరిక సంఘం అధ్యక్షుడుగా మేకల గోవర్ధన్ ను కుల సభ్యుల తీర్మానం మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మేకల రమేష్, గౌరవ సలహాదారులుగా మేకల యల్లయ్య, మేకల కృష్ణయ్య, దేవరగట్ల వెంకటేశ్వర్లు, మేకల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా దేవరగట్ల వీర శేఖర్, కోశాధికారిగా మేకల చిన్న లక్ష్మయ్య, కార్యదర్శులుగా మేకల వెంకటేశ్వర్లు, బాదే వంశీ, గొల్ల సైదులు, దేవరగట్ల సతీష్, కందిబండ నరసింహారావు, మేకల రమేష్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సముద్రాల రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సముద్రాల రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సోదర భావంతో ఐక్యంగా ఉండి నూతన కమిటీని ఎన్నుకోవడం అభినందనీయం అన్నారు. చెన్న కేశవపురం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని ప్రతి ఒక్క గ్రామంలో కమిటీని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గ్రామంలో మొదటి నూతన కార్యవర్గం ఏర్పాటు పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ నూతన అధ్యక్షులు మేకల గోవర్ధన్ మాట్లాడుతూ బేషాజాలకు పోకుండా ఐక్యంగా ఉండి కులాన్ని మరింత బలపరచుకుందామని అన్నారు. నూతన కార్యవర్గం ఏర్పాటు అయిన విషయాన్ని తెలుసుకున్న జిల్లా అధ్యక్షులు తక్షణమే వచ్చి కార్యవర్గాన్ని అభినందించడం హర్షణీయం అన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సముద్రాల రాంబాబు ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు పత్తిపాక వేణుదర్, సహాధ్యక్షుడు యర్రంశెట్టి రామలింగయ్య, సంయుక్త కార్యదర్శి నట్టే కిరణ్ కుమార్, కుల పెద్దలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా భోగి వేడుకలు



**హైదరాబాద్, 14, జనవరి, (నగర నిజం) :** తెలుగు రాష్ట్రాల్లో భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పంటల పండుగ సంక్రాంతి బుధవారం భోగితో ప్రారంభమైంది. పండుగలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా తెల్లవారుజామున భోగి మంటలు వెలిగించారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి చిన్నారులు ఆనందంగా భోగి మంటలు వేశారు. ఈ మూడు రోజుల పండుగను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భోగి, మకర సంక్రాంతి, కనుమ పేర్లతో జరుపుకుంటారు. తెలుగు లోగిళ్లు సంక్రాంతి ముగ్గులతో కళకళలాడుతున్నాయి. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఇతర నాయకులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగు ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేదీప్యమానంగా వెలిగే భోగి మంటలు ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఆశావహ దృక్పథంతో ముందుకు సాగే ఆలోచనలు సాకారం కావాలని తన సందేశంలో పేర్కొన్నారు.

## ఆర్థిక సహాయం అందచేసిన చెరుకు శివ కుమార్ గౌడ్



**చౌటుప్పల్ జనవరి 14 (నగర నిజం) :** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని 13వ వార్డు, రామ్ నగర్ కాలనీలో గత పది రోజుల క్రితం ఆకస్మికంగా గుండె పోటుతో సానబోయిన లింగస్వామి గౌడ్ మరణించడం జరిగింది. వారి కుటుంబానికి చౌటుప్పల్ రామ్ నగర్ కాలనికి చెందిన ప్రముఖ న్యాయ వాది చెరుకు శివకుమార్ గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడతూ ఒక కుటుంబం ఆకస్మికంగా ఇంటి పెద్దను కోల్పోతే వారి కుటుంబం పై చాలా భారం పడుతుందని కావున ఇలాంటి పేద వారికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శ్యామల లింగస్వామి, బొంగు బాబుగౌడ్, బొమ్మిరెడ్డి జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐలేను మల్లన్నను దర్శించుకున్న కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు పలుసం స్వామి గౌడ్



**వలిగొండ జనవరి14( నగరనిజం):** దుప్పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు పలుసం స్వామి గౌడ్ ఐలేను మల్లన్నను భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం మల్లన్నను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సండ్ల శ్రీను, వల్లపు పరశురాం యాదవ్, గుంటుజు నరసింహ చారి బీసు నరసింహ పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి.



**మొయినాబాద్, జనవరి 14 (నగర నిజం):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంకేపల్లి మాజీ సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు బుధవారము మున్సిపల్ పరిధిలోని ఎనకపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరగదుట మున్సిపల్ ఎన్నికల కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులందరూ ఏకతాటిగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చి బీఫామ్ అందజేసిన వారికి అ కృషి చేస్తామని పేర్కొనడంతో అమర్నాథరెడ్డి అందరినీ సంతోషించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు లక్ష్యంగా మనందరం కృషి చేయాలని సూచించారు ఇందిరమ్మ ఇండ్లు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే సాగుతున్నాయని తెలిపారు ప్రజలకు గ్రామాలలో అర్హులైన లబ్ధిదారులందరికీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కావడంతో ఈ కార్యక్రమం ఎంతో ఘనీయంగా సాగుతుందని అన్నారు దశలవారీగా ఇందిరమ్మండ్లకు బిల్లులు చెల్లిస్తూ అభివృద్ధి పథంలో ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులందరినీ ఆయన అభినందించారు జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉండాలని అందరం కృషి చేసుకుందామని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎనకపల్లి మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు గ్రామ అధ్యక్షులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ పత్రిక ఆవిష్కరణ



**చౌటుప్పల్ జనవరి 14 (నగర నిజం) :** చౌటుప్పల్ మున్సిపల్ వలిగొండ రోడ్ లో గల శ్రీ అలివేలు,పద్మావతి సమేత శ్రీ బాలాజీ రామకృష్ణ వెంకటేశ్వర స్వామి వార్ల రజతోత్సవం కళ్యాణ పత్రికను ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నాగిళ్ళ రామచంద్రం మాట్లాడుతూ స్వామి వారి దయతో రజతోత్సవ కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు చింతల ప్రభాకర్ రెడ్డి,ఊదరి శ్యామ్,ఉష్కగుల శ్రీను,చింతల దామోదర్ రెడ్డి, బత్తుల శ్రీశైలం,గుజ్జుల సురేందర్ రెడ్డి,మంచికంటి భాస్కర్ గుప్తా,ఆరుట్ల లింగస్వామి,కాసుల వెంకటేష్,తొర్పునూరి మల్లేష్,నల్ల పర్వతాలు,గణేష్, నకరకంటి శ్రీశైలం,ఊదరి మారయ్య,యాదయ్య,చేవగోని మహేష్,గంగిరెడ్డి నాగలక్ష్మి,జక్కర్తి శేఖర్,గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,అర్చకులు సంతోష్ లు పాల్గొన్నారు.

# అక్రమ గోవుల రవాణా, వధ, మాంస విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి


- బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకుడి ఫిర్యాదు



**బాలాపూర్ జనవరి 14 (నగర నిజం):** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్, జిహెచ్ఎంసీ బడంగ్‌పేట్ సర్కిల్ మలాపూర్ గ్రామ పరిధిలో కొనసాగుతున్న అక్రమ గోవుల రవాణా, వధ మరియు మాంస విక్రయాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొందరు వ్యక్తులు రాత్రి వేళల్లో ట్రక్కుల ద్వారా గోవులను అక్రమంగా తరలించి, బాలాపూర్ స్లాటర్ హౌస్‌లో రాత్రి సమయాల్లోనే వధ ప్రక్రియను నిర్వహిస్తూ, భారీ స్థాయిలో మాంసాన్ని నగర ప్రాంతాలకు తరలించి బహిరంగంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు .వధ ప్రక్రియ సమయంలో వెలువడుతున్న తీవ్రమైన దుర్వాసన వల్ల సుల్తాన్‌పూర్ పరిసర ప్రాంతాలకు చెందిన స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ అక్రమ, అమానుష కార్యకలాపాలను ప్రశ్నించిన స్థానికులను ప్రాణహానీ బెదిరింపులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయడానికి ప్రజలు భయపడుతున్న కారణంగా, సమిష్టిగా ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని తెలిపారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ గోవుల రవాణా, వధ మరియు మాంస విక్రయాలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించకపోతే భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కొంతం ప్రకాష్ రెడ్డి, రామచారీ, మంగపతి నాయక్, ఘా యాదిరెడ్డి, క్యారాగారి అరవింద్, కిరణ్, రాజ్ కుమార్, సుధాకర్, వినోద్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే ఇరాన్‌ను వీడండి

- భారతీయులకు రాయబార కార్యాలయం కీలక సూచనలు
- ఇరాన్‌లో తీవ్ర ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు
- కీలక ఆదేశాలు జారీ చేసిన భారత రాయబార కార్యాలయం
- అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచన



**హైదరాబాద్, నగరనిజం:** ఇరాన్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతోన్న ఆందోళనల కారణంగా అక్కడ మారణహోమం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. వేలాది మంది మృతి చెందగా, అందులో ఆందోళనకారులు 1,850 మంది, భద్రతా దళాల సిబ్బంది 135 మంది ఉన్నారు. ఆందోళనలతో సంబంధం లేని వారు కూడా పదుల సంఖ్యలో మరణించారు. ఆ దేశంలో ఎస్ఎంఎస్‌లు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఇరాన్‌లో ఆందోళనలు తీవ్ర హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో ఆ దేశంలో నివసిస్తున్న భారతీయులను అక్కడి భారత రాయబార కార్యాలయం అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని సూచించింది. "ఇరాన్‌లోని భారత పౌరులు (విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు) అందుబాటులో ఉన్న విమానాల ద్వారా వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లిపోవాలి" అని పేర్కొంది. తీవ్రమవుతున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల కారణంగా టెహ్రాన్‌తో సహా ఇరాన్‌లోని పలు నగరాల్లో పరిస్థితి మరింత దిగజారిందని రాయబార కార్యాలయం హెచ్చరించింది. నిరసన ప్రదేశాలకు దూరంగా ఉండాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించింది. రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదించాలని భారతీయ పౌరులు, భారత సంతతికి చెందిన వ్యక్తులకు తెలిపింది. ఆకస్మిక తరలింపు లేదా అత్యవసర ప్రయాణానికి సిద్ధంగా ఉండాలని తెలిపింది. తక్షణ సహాయం కోసం రాయబార కార్యాలయం అత్యవసర సంప్రదింపు ఫోన్ నెంబర్లను, అధికారిక ఈ-మెయిల్ ఐడీని పంచుకుంది. హెల్ప్‌లైన్ నెంబర్లు 98-9128109115, 98-9128109109, 98-9128109102, 98-9932179359 కాగా, ఈ-మెయిల్ ఐడీ cons.tehran@mea.gov.in లను పంచుకుంది. తదుపరి నోటీసు వచ్చే వరకు ఆ దేశానికి ప్రయాణం చేయవద్దని భారత విదేశాంగ శాఖ కూడా సూచించింది.

నగరనిజం

15 గురువారం, జనవరి 2026

# కూకట్ పల్లిలో ఆలయ దొంగల ముఠా అరెస్ట్





- రూ.26 లక్షల విలువైన చోరీ ఆభరణాల స్వాధీనం

**కూకట్ పల్లి, 14, జనవరి, (నగర నిజం) :** కూకట్ పల్లి జోన్ నేర నియంత్రణ విభాగం ప్రత్యేక బృందాలు కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ సిబ్బంది సహకారంతో అంతర్రాష్ట్ర ఆలయ దొంగల ముఠాను అరెస్ట్ చేశాయి. కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన చోరీ కేసులో సుమారు రూ.26 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం ఆలయ నిర్వహణ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. 6వ తేదీ రాత్రి ఆలయ గర్భగుడిని పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు దర్యాప్తులో తేలింది. భారత న్యాయ సంహిత చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దర్యాప్తు సమయంలో 200కు పైగా సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. సాంకేతిక నిఘా, నిందితుల వివరాల పరిశీలన, ఆధునిక పద్ధతుల ద్వారా నిందితులను గుర్తించారు. ఈ కేసులో నీలపు నీలయ్య అలియాస్ అనిల్, మహారాజు మల్లికార్జున్, బాష్య వెంకట్ మోహిత్ కుమార్, దున్నపోతుల పవన్ కళ్యాణ్ అలియాస్ కళ్యాణ్, దండి అనిల్ తేజ, కంబపు విజయ్, తంగిళ్ల మణికంఠ దుర్గ ప్రసాద్ అలియాస్ అఖిల్ ఉన్నారు. వీరిలో కొందరు పరారీలో ఉన్నారు. ప్రధాన నిందితుడు నీలపు నీలయ్యపై గతంలో 15కు పైగా ఆస్తి నేరాల కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి రూ.26 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు. ఒక ద్విచక్ర వాహనం, ఐదు స్మార్ట్ ఫోన్లు కూడా స్వాధీనం చేశారు. నిందితులను పట్టుకునే క్రమంలో విశేష కృషి చేసిన పోలీస్ సిబ్బందిని తగిన విధంగా ప్రోత్సహిస్తామని అధికారులు తెలిపారు.

# దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

**హైదరాబాద్, నగరనిజం:** దేశంలో బీసీ ఎస్సీ ఎస్టీ సామాజిక రిజర్వేష న్ పై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేసి జనాభా దామాషా ప్రకా రం బీసీ లకు రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ ఒకటే ఏకై క పరిష్కార మార్గమని, రాజ్యాంగ సవరణ కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి లు ప్ర త్యేక చొరవ తీసుకోవాలని బీసీ సం క్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసనశంకర్రావులు ఇరువురు సీఎంలకు విజ్ఞప్తి చే శారు. బుధవారం విజయవాడ పట్ట ణ కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో బిసి ఉ ద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం వి ఎస్ ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగి న మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశంలోని 11 రా ష్ట్రాలలో తమ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెం చాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారని అయిన ప్పటికీ గతంలో ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పు వలన రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదని తీర్పు చ్చిన దరిమిలా బీసీ రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్రాల చేతుల్లో లే కుండా పోయిందని వారు తెలిపారు. దేశంలో ఎస్సీ ఎస్టీలకు అలాగే చివరికి అగ్ర కులాలకు కూడా జనాభా దామషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని బీసీలకు మాత్రమే జనాభా ఉండి కూడా రి జర్వేషన్లు కల్పించకుండా అత్యల్ప శాతం క ల్పిస్తూ బీసీలకు తీరని అ న్యాయం చేస్తున్నారని వారు ఆ రోపించారు, అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూ ఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం కల్పించినప్పుడు దేశంలో మొ త్తం రిజర్వేషన్లు 60 శా తం అమలు జరుగుతున్న ఇవేమీ పట్టించుకోకుండా బీసీ రిజర్వేషన్లు పెంచినప్పుడు మాత్రమే 50 శాతం పరిమితి అంటూ గగ్గోలు పెడుతు బీసీలను రాజ కీయంగా అణిచివే యాలని చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో సమగ్ర కులగనన జ రిగి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన నేటి వరకు అమలు జరగ డం లేదని, అదే విధంగా ఆంధ్రప్రదే శ్



రాష్ట్రంలో సమగ్ర కుల గణన చే పట్టి బీసీల జనాభా లెక్కలు తేల్చా లని ఎందుకోసం తక్షణ మే డెడికేష న్ కమిషన్ ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వ హించాలని వారు డి మాండ్ చేశారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం 34 శాతం రిజర్వేషన్లు అమ లు చేసి న తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిం చా లని వారు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీల పైన భౌతిక దాడులు, సామా జిక బహిష్కరణలు, కులం పేరుతో దూషణ లు జరగకుండా సామాజిక రక్షణ కల్పించడానికి బీసీ రక్షణ చట్టాన్ని తీసుకు రావాలని ప్రయత్నించడం చాలా అభినందనీయమని ఇదే సమయంలో భవిష్యత్తులో కోర్టుల లో ఈ చట్టం వీగిపోకుం డా ఉండడానికి సమగ్రమైన చట్టాన్ని రూపొందించి న్యాయ వివాదాలకు తావు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. అ లాగే తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తరహాలోనే బీసీ రక్షణ చట్టాన్ని తీ సుకురావాలని డి మాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై త్వరలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసే ప్రయ త్నం చేస్తామని ఇదే సమయంలో ఏపీ తెలం గా ణ సీఎంలు ఇరువురు అ ఖిలపక్షం తో ఢిల్లీకి వెళ్లి భారత ప్ర ధాని నరేంద్ర మోడీతో భేటీ నిర్వ హించాలని ప్రత్యేకంగా ఎ న్డీఏ కూట మిలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు నాయు డు ప్రత్యేక చొరవ తీసు కొని బీసీ రిజర్వేషన్లు పెంపు కోసం ఢిల్లీలో చక్రం తిప్పాలని వారు కోరా రు. బీసీ రిజర్వేషన్ల పెం పు, బీసీ రక్ష ణ చట్టంపై సంక్రాంతి పండుగ తర్వాత విజయ వాడలో బీసీల మే ధోమదన సమావేశఁ నిర్వహించి భవి ష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని, బీసీ రిజర్వేషన్లు పెంచే వ రకు దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జాజు ల శ్రీనివాస్ గౌడ్, కేసిన శంకర్రావులు వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి అన్నవరపు నాగ మల్లేశ్వరరావు, బీసీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్వి రావు, ప్రధాన కార్యదర్శినమ్మి అప్పా రావు, బీసీ ఉద్యోగుల సం ఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షు లు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, సుబ్బరావు, బాదన్న బాబయ్య, రాంబాబు, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సురంగల్ ప్రీమియం లీగ్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంటు




**మొయినాబాద్, జనవరి13:** క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటి పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన యువ నాయకుడు గుమ్మళ్ల సీతారాంరెడ్డి, గుమ్మళ్ల విక్రంరెడ్డిలు సురంగల్ ప్రీమియం లీగ్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంటు గత రెండు రోజులుగా జరుగుతుంది. క్రికెట్ టోర్నమెంట్లో నాలు జట్టు పాల్గొనగా ఫైనల్కు క్యాప్టెన్ -11 జట్టు, ఆర్కే రైస్ జట్లు చేరుకున్నాయి. రెండు టీంలు హోరాహోరిగా తలపడగా క్యాప్టన్స్ 11 జట్టు 8 రన్స్ తేడాతో విజయం సాధించారు. టోర్నమెంట్ నిర్వహించిన గుమ్మళ్ల సీతారాంరెడ్డి గెలిచిన క్యాప్టెన్స్-11 టీంకు రూ.22,222లు షీల్డ్, ద్వితీయ స్థానంలో నిలిచిన ఆర్కే రైస్ జట్టుకు రూ.11,111లు, షీల్డ్ ప్రకటించగా మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, శ్రీరాంనగర్ మాజీ సర్పంచ్ ఎస్ ప్రభాకర్రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఇరు ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలు మెరుగు పరుస్తాయని పేర్కొన్నారు. క్రీడలు మానసికోల్లోసానికి, శారీరద్రాఢ్యాన్యానికి ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. క్రీడలతో వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఇలాంటి టోర్నమెంట్ వలన క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడ నైపుణ్యంను వెలికి, తీసుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమిలు సర్వసాధారణం అని ఓటమిని గెలుకకు నాందిగా స్వీకరించాలని సూచించారు. ఓటమితో కుంగిపోవద్దని క్రీడాకారులకు చెప్పారు. కార్యక్రమంలో క్రికెట్ జట్ల కెప్టెన్లు వినోద్కుమార్, పాశం బాల్రాజ్, మేకల సురేష్, లతీఫ్ లు, నాయకులు ఎం శ్రీకాంత్, ప్రభుయాదవ్, ప్రశాంత్ గౌడ్, వినాయకరెడ్డి, తదితరులు

# ఏపీలో కోడి పందాల జోరు..

- పశ్చిమ గోదావరి జిల్లాలో ఏపీ డిప్యూటీ స్పీకర్ సహా పలు నేతల సందడి
- పందెం రాయుళ్లు, ప్రేక్షకులతో పలు జిల్లాల్లో కోలాహలం



**హైదరాబాద్, నగరనిజం:** కోడి పందాలు వీక్షించేందుకు తెలంగాణ నుంచి వచ్చిన జనం ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి వేడుకల్లో కోడిపందాలదే ప్రధాన సందడని చెప్పడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు పలుచోట్ల ఏటా సంక్రాంతి పండుగకు కోడిపందాలు నిర్వహిస్తుంటారు. ఈ పందాలను చూడడానికి తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల నుంచి జనం వస్తుంటారని స్థానికులు చెబుతున్నారు .ఈసారి పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన కోడి పందాలలో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులతో పాటు హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి పాల్గొని సందడి చేశారు. జిల్లాలోని కాళ్ల మండలం పెదఅమిరంలో జరిగిన ఈ పోటీలలో పాల్గొన్న నేతలు.. పందెం కోళ్లతో ఫొటోలకు ఫోజులిచ్చారు. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాలో కోడి పందాలు భారీ ఎత్తున జరుగుతున్నాయి.

# కేసీఆర్‌ను విమర్శించడానికి మేం అవసరం లేదు.. ఆమె చాలు



- కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పులమయం చేశారని ఆరోపణ
- కేసీఆర్ చేసిన అప్పులను తీరుస్తున్నామన్న మంత్రి
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, నగరనిజం:** బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శించేందుకు తాము అవసరం లేదని, ఆయన కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరిపోతారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేస్తే, వాటిని తమ ప్రభుత్వం తీర్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు. అప్పులు తీరుస్తూనే రాష్ట్ర అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ వల్ల పాలమూరుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉండగా, రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే 90 శాతం పనులు ఎలా పూర్తవుతాయో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పి మోసాలు చేయాలని చూస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు. కేసీఆర్ మాత్రం ఏదో ఒకరోజు మాత్రమే పనుల కోసం సమయం కేటాయించారని విమర్శించారు. అందుకే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. వివిధ పథకా ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిం దని తెలిపారు. మరో ఇరవై రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగను న్నాయని, ఆ ఎన్నికల్లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మె ల్యేలు లేని పార్టీలకు ఓటు వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ఆయన అన్నారు. పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 40 శాతం సర్పంచ్ స్థానాలను గెలిచామని పార్టీ గుర్తుతో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో గెలవాలని ఆయన సవాల్ విసిరారు.

# సంపాదకీయం


## అష్టదిగ్బంధంలో ఇరాన్!



సమస్యలున్నచోట నిప్పురాజేయటం సులభం. నిన్న మొన్నటివరకూ అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడులతో ఊపిరాడని ఇరాన్ ఇప్పుడు నిరసనలతో అట్టుడుకుతోంది. భవనాలు, బస్సులు, దుకాణాలు తగలబడుతున్నాయి. రాజధాని తెహ్రాన్ నగరం యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తోంది. అదొక్కటే కాదు...దేశంలోని 31 ప్రావిన్సుల్లో ఉన్న 180 నగరాలు, పట్టణాలు ఇప్పుడు ఆగ్రహావేశాలతో రగులుతున్నాయి. ద్రవ్యోల్బణం చుక్కలనంటుతూ, కరెన్సీ విలువ పడిపోతూ దుర్భర దారిద్ర్యాన్ని ఎదుర్కొంటున్న జనం గత రెండువారాలుగా రోడ్లపై వెల్లువెత్తుతుండగా, ఇంతవరకూ సైన్యం, పోలీసులు జరిపిన కాల్పుల్లో 538 మంది మరణించారు. పదివేలమందిని జైళ్లలోపెట్టారు. మొత్తానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెనిజులాలో సాధించలేనిది ఇరాన్‌లో సునాయాసంగా చేయగలిగారు. వెనిజులాలో ఇదే మాదిరి ప్రేరేపించి, ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందన్న సాకుతో అధ్యక్షుడు నికోలస్ మదురోను గద్దె దించాలని ట్రంప్ ఏడాదిగా ప్రయత్నించారు. అది అసాధ్యం కావటంతో నేరుగా సైన్యాన్ని పంపి మదురో దంపతుల్ని అపహరించారు. ప్రస్తుతం ఇరాన్‌పై దాడులు చేయటానికి అమెరికా సంసిద్ధమవుతోంది.దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా అమెరికా, పాశ్చాత్యదేశాలు పగబట్టి అమలు చేస్తున్న ఆర్థిక ఆంక్షలతో ఇరాన్ తీవ్రంగా దెబ్బతింది. నిత్యావసరాలు దొరక్క ప్రజలు సతమతమవుతున్నారు. ప్రాణావసర ఔషధాల కొరత వేధిస్తోంది. తగిన వైద్య సదుపా యాలు కరవై రోగాల బారిన పడిన చిన్నపిల్లలు కన్నుమూస్తున్నారు. ఇలాంటి పరిస్థి తుల్లో ప్రభుత్వంపై ఆగ్రహావేశాలు పెల్లుబకటం, నిరసనలు వెల్లువెత్తడంలో ఆశ్చర్య మేమీ లేదు. ఇటీవల ఆందోళనకారుల నుంచి స్వాధీనం చేసుకున్న ఐఫోన్‌లో విదేశీ మహిళగా భావిస్తున్న ఒకామె అరెస్టయినప్పుడు ఏం చేయాలో, ఎలాంటి ప్రకటన లివ్వాలో చెప్పే వీడియో బయటికొచ్చింది. తమ వెనుక ఎవరూ లేరని... దుర్భర పరిస్థి తుల్ని తట్టుకోలేక నిరసనల్లో పాలుపంచుకుంటున్నట్టు చెప్పాలన్న హితబోధ ఉంది. ఇరాన్‌కు ఇలాంటి నిరసనలు కొత్తగాదు. 1979లో ఇరాన్ షా మహమ్మద్ రెజా పెహ్లావీని గద్దెదించిన ఇస్లామిక్ విప్లవం అనంతరం పాశ్చాత్య దేశాలు సమయం కోసం కాచుక్కూర్చున్నాయి. 2022లో మహిళల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం, ఉనికి కోసం అంటూ సాగిన ఉద్యమాన్ని ప్రభుత్వం అణిచేయగలిగింది. ఇక అడపా దడపా ఏదో ఒక వంకతో ఇరాన్‌పై క్షిపణుల్ని ప్రయోగించటం, దేశ సైన్యంలో కీలకపాత్ర పోషిస్తున్న వారిని, అణు శాస్త్రవేత్తలనూ హత్యలు చేయించటం ఇజ్రాయెల్‌కు రివాజు. ఇలా జరిగిన ప్రతిసారీ ద్రోహుల్ని పట్టుకున్నామని ప్రభుత్వం ప్రకటించి, బహిరంగంగా ఉరిశిక్షలు అమలు చేస్తోంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి ఆందోళనల తీవ్రత ఎక్కువుంది. దిగువ తరగతి ప్రజలతో పాటు మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలు కూడా ఈ నిరసనల్లో చురుగ్గా పాల్గొంటున్నాయి. నిరసనలు చల్లార్చటానికి ప్రభుత్వం ప్రయత్నించకపోలేదు. దుకాణదారుల డిమాండ్లకు స్పందనగా సెంట్రల్ బ్యాంకు గవర్నర్‌ను మార్చారు. ప్రతి ఇంటికీ నెలకు ఏడు డాలర్ల మొత్తం ఇచ్చేందుకు అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అంగీకరించారు. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది. ఉద్యమకారులు వెనక్కి తగ్గేది లేదన్నారు. సాధారణ ప్రజానీకం సమస్యల్ని పరిష్కరిస్తానని, ప్రభుత్వ జోక్యాన్ని తగ్గిస్తానని అధికారంలోకొచ్చిన మసూద్ పూర్తిగా విఫలమయ్యారు. ప్రభుత్వంలో పెచ్చరిల్లిన అవినీతిని అరికట్టలేకపోయారు. ప్రజల్లో అసంతృప్తి కనబడుతున్నా నాయకత్వం నిస్తేజంగా ఉండిపోయింది. పైపెచ్చు నిరసనల్లో పాల్గొంటున్న వారిని 'దేవుడికి వ్యతిరేకంగా యుద్ధం సాగిస్తున్నార'ంటూ కేసులు పెట్టడం, అరెస్టులు చేయటం ప్రజల్ని మరింత రెచ్చగొట్టింది. ఈ నేరారోపణ కింద ఉరిశిక్షతో సహా కఠినమైన శిక్షలు విధించటానికి ప్రభుత్వానికి అధికారం లభిస్తుంది. అమెరికాలో స్థిరపడిన ఒకప్పటి నియంత ఇరాన్ షా కుమారుడు రెజా పెహ్లావి తానొచ్చి దేశాన్ని ఉద్ధరిస్తానంటున్నారు. ఛాందసవాద ధోరణుల్ని తగ్గించుకుని ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పితే తప్ప బలప్రయోగంతో నిరసనలు అణిచేయటం అసాధ్యమని ఇరాన్ పాలకులు గుర్తించాలి.

# పోలీసుల అదుపులో ముగ్గురు జర్నలిస్టులు

- **బిగ్ బ్రేకింగ్, మహిళా ఐఏఎస్ పై ప్రసారాలపై ప్రభుత్వం సీరియస్, పో లీసుల అదుపులో ముగ్గురు జర్న లిస్టులు**



**హైదరాబాద్, నగరనిజం:**తెలంగా ణలో ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచేలా వార్తలు ప్రసారం చేశారంటూ నమోదైన కేసులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు యమస్పీడ్ గా ముందుకు సాగుతున్నారు. తెలంగాణ ఐఏఎస్ అధికా రుల సంఘం తరపున సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయా డిజిటల్ మీడియా , యూట్యూబ్ ఛానల్స్‌పై సీసీఎస్ పోలీసులు కేసు నమో దు చేసిన విషయం తెలిసిందే. అయితే సదరు కేసులో మంగళవారం అర్ధ రాత్రి ఓ ఛానల్ ఇన్ పుట్ ఎడిటర్‌తో పాటు ఇద్దరు రిపోర్టర్ల ను అరెస్ట్ చేశారు. కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్తుండగా ఇన్‌పుట్ ఎడిటర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఇదిలా ఉండగా మహిళా ఐఏఎస్ ను కించపరిచే విధంగా సదరు ప్రధాన చానల్ తో పాటు 44 యూట్యూబ్ ఛానల్స్ కథనాలు ప్రసారం చేసినట్లు పోలీసులు గుర్తించగా ఈ క్ర మంలో ఆయా యూట్యూబ్ ఛానళ్లపై చర్యలకు రంగం సిద్ధ మైనట్లు సమాచారం. ఆయా ఛానల్స్ బాధ్యులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సీసీఎస్ పోలీసులు కసరత్తు ప్రారంభిం చారు. ఇప్పటికే పలువురిని పో లీసులు గుర్తించగా ఈ కేసు లో పోలీసుల దూకుడుతో పలువురు యూట్యూబ్ ఛానల్స్ నిర్వాహకులు అజ్ఞాతంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ సీఎం ఫొటో మా ర్ఫింగ్, మహిళా ఐఏఎ స్‌పై అసభ్య కర కథనాలపై తెలంగాణ ప్రభుత్వం సిట్‌ను ఏ ర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏ ర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.సజ్జనార్ పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తోంది. దర్యాప్తు వేగంగా పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ అ య్యాయి.మరోవైపు మహిళా అధికారిపై అసభ్యకర కథనాలను మం త్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తీవ్రంగా ఖండించా రు. అలాగే ఐఏఎస్, ఐపీ ఎస్ అసోసియేషన్లు కూడా ఈ వ్య వహారంపై సీరియస్ అయ్యాయి. ఇలాంటి వార్తలు అధికా రుల మనోభావాలను దెబ్బతీస్తాయని, చట్టపరంగా కఠిన చ ర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే తాజా అరెస్టులు, త్వరలో కాబోయే అరెస్టులు అం టూ పరిశీలకులు భావిస్తున్నారు.అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టును ఖండించిన టీయూడ బ్ల్యూజే : NTV జర్నలిస్టులు దొంతు రమేష్, పరిపూర్ణ చారి, సుధీర్‌లను అర్ధ రాత్రి పోలీసులు అరెస్టు చేయడాన్ని టీ యూడబ్ల్యూజే పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని టీయూ డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అల్లం నారా యణ, ఆస్కానిమారుతి సాగర్, తెంజు అధ్యక్ష, కార్యదర్శు లు విష్ణువర్ధన్ రెడ్డి, ఎ. రమణకుమార్ లు, టీయూడబ్ల్యూ జె నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండగోని జయ శంకర్ గౌడ్, వీరస్వామి, శివ ప్రసాద్, జిల్లా తెంజు, అధ్యక్ష కార్యదర్శులు వెంకటరెడ్డి, జానయ్యలు పేర్కొన్నారు.జర్నలిస్టులు గానీ, ఆ వార్త సంస్థ గాని నిరాధారమైన, అ సత్య వార్త కథనాలు రాస్తే ఆ విషయంలో ఖండన కోరు కో వచ్చు అప్పటికీ వారు స్పందించకపోతే చట్ట పరమైన చ ర్య లు తీసుకోవచ్చు కానీ, ఇలా అ ర్ధరాత్రి ఎలాంటి నోటీసులు ఇవ్వ కుండా వారిని అరెస్టు చేయడం సరైంది కాదు. ఈ ము గ్గురూ జర్నలిజంలో కొనసాగుతున్న సీనియర్ జర్నలిస్టులు. వీరి అరెస్టును తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్న లిస్టుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇదే సమ యంలో జర్నలిస్టులకు సంఘం తరపున ఒక సూచన కూ డా చేస్తున్నామన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారుల విషయంలో నిరాధారమైన వార్తలను ప్రసారం గాని, ప్రచురించవద్దని, ఆ ధారాలు ఉంటేనే వార్తలు వేయాలని, ముఖ్యశీగా ఎవరి వ్య క్తిగత ప్రతిష్టను దెబ్బతీసే విధం గా వార్త కథనాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా మీడియా సంస్థలపై ఉం టుందని గుర్తు చేశారు. ఏది ఏమైనా జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం అర్ధరాత్రి పూట తీవ్రవాదుల అరెస్టు చే యడం ఎంత మాత్రం సమంజసం కాదని, వెంటనే ప్రభు త్వం ఈ విష యంలో చొరవ తీసుకొని అరెస్టు చేసిన జర్న లిస్టులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## తప్పు చేయకపోతే ఎందుకు భయపడుతున్నారు?

- **సీపీ సజ్జనార్**



**హైదరాబాద్, నగరనిజం:**ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరెస్టుపై సీపీ స్పందించారు. "మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలి. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారు? పిలిస్తే.. విచారణకు రావాలి కదా. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారు. అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం.త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుంది. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి.సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోంది"అని సీపీ తెలిపారు.

## కేంద్ర మంత్రి నివాసంలో పొంగల్ వండిన ప్రధాని నరేంద్ర మోదీ

- **కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో పొంగల్ వేడుకలు**
- **ప్రపంచవ్యాప్తంగా తమిళులకు శుభాకాంక్షలు తెలిపిన మోదీ**
- **తమిళనాడు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రశంసించిన మోదీ**





**హైదరాబాద్, నగరనిజం:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొంగల్ వంటకం తయారు చేశారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ తొలుత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పొంగల్ వండి, గోవులకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. పొంగల్ పండుగ సందర్భంగా తమిళనాడు ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ రాష్ట్ర రైతులను, తమిళనాడు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రశంసించారు. పొంగల్ పండుగ తమిళుల గొప్ప సంప్రదాయానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "ప్రియమైన భారతీయులారా, వణక్కం. పొంగల్ సందర్భంగా మీకు, మీ కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

# డెన్మార్క్‌లోనే ఉంటామన్న గ్రీన్‌లాండ్ ప్రధాని..


- **హెచ్చరించిన ట్రంప్**
- **డెన్మార్క్‌లోనే కొనసాగాలంటే అది వారికే పెను సమస్యగా మారుతుందన్న ట్రంప్**
- **ఫ్రెడరిక్ అభిప్రాయంతో తాను ఏకీభవించడం లేదన్న ట్రంప్**
- **అమెరికాలో చేరకుంటే రష్యా, చైనా ఆక్రమిస్తాయని గ్రీన్‌లాండ్ కు హెచ్చరిక**



**హైదరాబాద్, నగరనిజం:**తాము డెన్మార్క్‌లోనే ఉంటామని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ చేసిన ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. అమెరికాలో తాము చేరబోమని జెన్స్ ఫ్రెడరిక్ తేల్చి చెప్పిన నేపథ్యంలో ట్రంప్ గ్రీన్‌లాండ్‌కు మరోమారు హెచ్చరికలు జారీ చేశారు.డెన్మార్క్‌లో కొనసాగడం గ్రీన్‌లాండ్‌కు పెను సమస్యగా పరిణమిస్తుందని ట్రంప్ హెచ్చరించారు. డెన్మార్క్‌లో కొనసాగాలనేది జెన్స్ ఫ్రెడరిక్ వ్యక్తిగత సమస్య అని అభివర్ణించిన ట్రంప్, ఆయన అభిప్రాయంతో తాను ఏకీభవించబోనని అన్నారు. ఆయన గురించి తనకు పెద్దగా తెలియదని, డెన్మార్క్‌లో కొనసాగితే గ్రీన్‌లాండ్‌కే నష్టమని స్పష్టం చేశారు.గ్రీన్‌లాండ్ తప్పనిసరిగా అమెరికా భూభాగంలో చేరాలని ట్రంప్ అల్టిమేటం విధించారు. లేని పక్షంలో ఆ ప్రాంతాన్ని రష్యా, చైనా వంటి దేశాలు ఆక్రమిస్తాయని హెచ్చరించారు. ఆ దేశాలకు చెందిన రక్షణ బలగాలు ఇప్పటికే అక్కడ పాగా వేశాయని వ్యాఖ్యానించారు. తాను తలుచుకుంటే వారి అధిక సంఖ్యలో సైన్యాన్ని మోహరించగలనని పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్‌లో అమెరికా జెండా ఎగరాలని ట్రంప్ ఆకాంక్షించారు.ఇటీవల గ్రీన్‌లాండ్ ప్రజలకు ట్రంప్ నగదు ఆఫర్ చేసినట్టు వార్తలు రావడం తెలిసిందే. దీనిపై ఆయనను మీడియా ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని బదులిచ్చారు.

# 40 ఏళ్లుగా ఉగ్రవాదంపై కెనడాకు చెబుతున్నాం..

- **భారత రాయబారి విమర్శలు**
- **ఉగ్రవాదాన్ని అరికట్టడంలో 40 ఏళ్లుగా విఫలమవుతున్నారని ఆగ్రహం**
- **భారత్ వ్యతిరేక కుట్రలకు ఒట్టావా కేంద్రంగా మారుతోందని ఆరోపణ**
- **భారత్‌ను ఆధారాలు అడుగుతున్న కెనడా, తాను మాత్రం ఆధారాలు చూపించడం లేదని విమర్శ**



**హైదరాబాద్, నగరనిజం:**కెనడా గడ్డ నుంచి జరుగుతోన్న ఉగ్రవాద కుట్రల గురించి తాము పదేపదే చెబుతున్నప్పటికీ, దానిని అరికట్టడంలో కెనడా 40 సంవత్సరాలుగా విఫలమవుతోందని కెనడాలోని భారత హైకమిషనర్ దినేశ్ పట్నాయక్ విమర్శించారు. భారత్ వ్యతిరేక కుట్రలకు ఒట్టావా కేంద్రంగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కెనడా మీడియా సంస్థ సీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత్‌పై ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. నాలుగు దశాబ్దాలుగా కెనడా దేశాధినేతలు ఎవరైనా ఉగ్రవాద కట్టడికి చర్యలు చేపట్టారా అని ప్రశ్నించారు. భారత్ ఆధారాలు సమర్పించిన వివిధ కేసుల్లో ఒక్కరికైనా శిక్ష పడిందా అని నిలదీశారు.ఉగ్రవాదం విషయంలో కెనడా ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోందని ఆయన ఆరోపించారు. ఉగ్రవాదుల గురించి భారత్ మాట్లాడినప్పుడు ఆధారాలు కావాలని డిమాండ్ చేస్తోన్న కెనడా ప్రభుత్వం, మన దేశంపై ఆరోపణలు చేసినప్పుడు మాత్రం ఆధారాలు చూపించడం లేదని అన్నారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE